సాక్షి
యాదాద్రి భువనగిరి
శుక్రవారం । 18 । అక్టోబర్ । 2024



ఉర్సు ప్రారంభం
నల్లగొండలోని లతీఫ్ ఉల్లాషాఖాద్రి ఉర్సులో భాగంగా గంధం ఊరేగింపు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. - 8లో



అనుమతి ఇవ్వొద్దు
సిమెంట్ పరిశ్రమ ఏర్పాటుకు అనుమతి ఇవ్వొద్దని సీపీఎం నాయకులు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. - 9లో



మత్స్యకారుల అభివృద్ధే ధ్యేయం
మత్స్యకారులను ఆర్థికంగా బలోపేతం చేయడమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. - 9లో

న్యూస్‌రీల్

సమ్మె విరమణ

భువనగిరి : డిగ్రీ, పీజీ కళాశాలల యాజమాన్యాలు సమ్మె విరమించాయి. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 14నుంచి రాష్ట్ర వ్యాప్తంగా ప్రైవేట్ డిగ్రీ, పీజీ కళాశాలల నిరవధిక బంద్ పాటిస్తున్న విషయం తెలిసిందే. ఇందులో భాగంగా మూడు రోజుల నుంచి వివిధ రూపాల్లో నిరసన కార్యక్రమాలు చేపట్టాయి. నాలుగు రోజుల్లో ఫీజురీయింబర్స్ బకాయిలతో పాటు ఉపకార వేతనాలు విడుదల చేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి హామీ ఇవ్వడంతో నిరవధిక బంద్ విరమిస్తున్నట్లు ప్రైవేట్ డిగ్రీ, పీజీ కళాశాలల మేనేజ్‌మెంట్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ బొజ్జ సూర్యనారాయణరెడ్డి గురువారం తెలిపారు. ఈ నెల 18 నుంచి యథావిధిగా కళాశాలలు కొనసాగుతాయన్నారు.

ఆలయ ట్రస్టు బోర్డు ఏర్పాటు

సంస్థాన్ నారాయణపురం: మండలంలోని రాచకొండలో గల పురాతన శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయానికి ట్రస్ట్ బోర్డు ఏర్పాటు చేస్తున్నట్లు దేవాదాయ ధర్మాదాయ శాఖ సంస్థాన్‌నారాయణపురం మండల ఇంచార్జి చిట్టెడి వెంకట్‌రెడ్డి తెలిపారు. ఈ మేరకు దేవాదాయ శాఖ గురువారం ప్రకటన విడుదల చేసినట్లు ఆయన పేర్కొన్నారు. అభ్యంతరాలు ఉంటే 20 రోజుల్లో హైదారాబాద్, నల్లగొండ దేవాదాయ శాఖ కార్యాలయంలో తెలియజేయాలన్నారు.

నారసింహుడికి నిత్యారాధనలు



ఉత్సవమూర్తులకు నిత్యకల్యాణ వేడుక నిర్వహిస్తున్న అర్చకులు

యాదగిరిగుట్ట : యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో గురువారం సంప్రదాయ పూజలు కొనసాగాయి. వేకువజామునే సుప్రభాత సేవ, అనంతరం స్వయంభూ, ప్రతిష్ఠా అలంకారమూర్తులకు నిజాభిషేకం, తులసీ దళాలతో అర్చన చేశారు. అలాగే ప్రథమ ప్రాకార మండపంలో గజవాహన సేవ, నిత్యకల్యాణం, బ్రహ్మోత్సవం నిర్వహించారు. సాయంత్రం స్వామి, అమ్మవారి జోడు సేవను ఆలయ మాడ వీధుల్లో ఊరేగించారు.

న్యాయమూర్తుల బదిలీ

చివ్వెంల(సూర్యాపేట) : జిల్లా కోర్టు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి, మొదటి అదనపు జూనియర్ సివిల్ జడ్జి బదిలీ అయ్యారు. ఈ మేరకు హైకోర్టు గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జిగా పనిచేస్తున్న కామిశెట్టి సురేష్ పదోన్నతిపై కోదాడ కోర్టు సీనియర్ సివిల్ జడ్జిగా వెళ్లారు. సికింద్రాబాద్ మెట్రో పొలిటియన్ మెజిస్ట్రేట్‌గా పనిచేస్తున్న గోపు రజిత ఇక్కడికి రానున్నారు. అదేవిధంగా మొదటి అదనపు జూనియర్ సివిల్ జడ్జిగా పనిచేస్తున్న జె.ప్రశాంతి మల్కాజ్‌గిరి కోర్టుకు రెండో అదనపు జూనియర్ సివిల్ జడ్జిగా బదిలీపై వెళ్లారు. మిర్యాలగూడ కోర్టు రెండో అదనపు జూనియర్ సివిల్ జడ్జి నాగూరి అపూర్వరవళి మొదటి అదనపు జూనియర్ సివిల్ జడ్జిగా సూర్యాపేటకు రానున్నారు.

ఇష్టానుసారంగా రోడ్డు విస్తరిస్తున్నారని ధర్నా



ధర్నా చేస్తున్న బాధితులు

మోత్కూరు : పట్టణంలోని ప్రధాన రోడ్డు విస్తరణ పనులు ఇష్టానుసారంగా చేస్తున్నారని, మున్సిపల్ అధికారుల తీరును నిరసిస్తూ దుకాణదారులు, ఇళ్ల యజమానులు గురువారం రాస్తారోకో నిర్వహించారు. రోడ్డు మధ్య నుంచి ఇరువైపులా 40 ఫీట్ల చొప్పున 80 ఫీట్లకు విస్తరించాలని మున్సిపల్ పాలకవర్గంలో తీర్మానించారని, అందుకు భిన్నంగా పడమర వైపు 35 ఫీట్ల వరకే విస్తరిస్తున్నారని తూర్పు వైపు ఉన్న దుకాణదారులు, ఇళ్ల యజమానులు ఆరోపించారు. మున్సిపల్ అధికారులు సమన్యాయం పాటించకుండా రోడ్డు విస్తరించడం తగదన్నారు. తూర్పువైపు కూడా 35 ఫీట్లకే విస్తరించాలని డిమాండ్ చేస్తున్నారు. రాస్తారోకోతో పెద్ద ఎత్తున వాహనాలు నిలిచిపోయాయి.మున్సిపల్ చైర్మన్‌తో మాట్లాడి సమస్య పరిష్కరించుకోవాలని పోలీసులు నచ్చజెప్పడంతో రాస్తారోకో విరమించారు. ఎవ్వరికీ ఇబ్బంది కలగకుండా రోడ్డు విస్తరిస్తామని మున్సిపల్ చైర్‌పర్సన్ గుర్రం కవిత వారికి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఏలె యాదగిరి, ఎండీ అబ్బాస్, బైరు యాకయ్య, ఎండీ యాకూబ్, బైరు వెంకన్న, దబ్బెటి ఎల్లయ్య, రామకృష్ణ, పుల్కరం రాజయ్య, రామోజీ పాల్గొన్నారు.

ఉత్సాహంగా సీఎం కప్ టార్చ్ ర్యాలీ



సీఎం కప్ టార్చ్ ర్యాలీని ప్రారంభిస్తున్న ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య, కలెక్టర్ హనుమంతు కే.జెండగే, చిత్రంలో అదనపు కలెక్టర్ గంగాధర్, అధికారులు, ప్రజాప్రతినిధులు

సాక్షి, యాదాద్రి : జనగామ నుంచి గురువారం భువనగిరికి చేరిన సీఎం కప్–2024 టార్చ్ ర్యాలీ ఉత్సాహంగా సాగింది. కలెక్టరేట్ వద్ద ర్యాలీకి ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య, కలెక్టర్ హనుమంతు కే.జెండగే, అదనపు కలెక్టర్ గంగాధర్ తదితరులు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ అయిలయ్య మాట్లాడుతూ.. ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. ప్రతిభావంతులైన క్రీడాకారులను వెలికితీసేందుకు సీఎం కప్ చక్కటి వేదిక అన్నారు. గ్రామ, మండల, జిల్లా, రాష్ట్ర స్థాయిలో సీఎం కప్ క్రీడా పోటీలు ఉంటాయని, యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కలెక్టర్ మాట్లాడుతూ.. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని కోరారు. ర్యాలీ భువనగిరి ఖిలా వరకు కొనసాగింది. ఈ కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ శోభారాణి, జిల్లా యువజన, క్రీడల అధికారి, ధనంజనేయులు, ఎస్సీ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ శ్యాంసుందర్, జిల్లా అధికారులు జైపాల్‌రెడ్డి, రమణి, మున్సిపల్ చైర్మన్ పోతంశెట్టి వెంకటేశ్వర్లు, పర్వతారోహకురాలు పడమటి అన్వితారెడ్డి, వ్యాయామ ఉపాధ్యాయులు, విద్యార్థులు, క్రీడాకారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ కమిటీలు రెడీ

కలెక్టర్‌కు చేరిన జాబితా
- జిల్లా ఇంచార్జి మంత్రి ఆమోదమే తరువాయి
- ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపికలో కమిటీలే క్రియాశీలకం
- కష్టపడిన వారికి స్థానం దక్కలేదని కాంగ్రెస్ కేడర్ ఆవేదన
- కాంగ్రెస్ కార్యకర్తలతో నింపారని విపక్షాల ఆరోపణ



సాక్షి యాదాద్రి : నిరుపేదల సొంతింటి కలకు మార్గం సుగమం కానుంది. ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని అమల్లోకి తీసుకొచ్చే దిశగా కసరత్తు చేస్తున్న ప్రభుత్వం.. అందుకోసం ఇందిరమ్మ కమిటీలు ఏర్పాటు చేస్తోంది. యాదాద్రి జిల్లాలో 500 కమిటీలకు గాను అంతటా పూర్తయ్యాయి. లబ్ధిదారుల ఎంపిక, ఇళ్ల నిర్మాణాల పర్యవేక్షణలో ఇందిరమ్మ కమిటీలు క్రియాశీలకంగా వ్యవహరించనున్నాయి.

పంచాయతీలు, మున్సిపాలిటీల్లో కమిటీలు ఇలా..

పంచాయతీ, మున్సిపల్, గృహనిర్మాణ శాఖల అధికారులు సంయుక్తంగా ఇందిరమ్మ కమిటీలు ఏర్పాటు చేశారు. 426 గ్రామ పంచాయతీలు, ఆరు మున్సిపాలిటీల్లోని 104 వార్డుల్లో కమిటీలు పూర్తయ్యాయి. ఈ జాబితాను ఆయా శాఖల అధికారులు గురువారం కలెక్టర్‌కు అందజేశారు. ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద ఒక్కో అసెంబ్లీ నియోజకవర్గానికి ప్రభుత్వం 3,500 ఇళ్లు కేటాయించనుంది. లబ్ధిదారుల ఎంపిక, ఇంటి నిర్మాణంలో పారదర్శకత ఉండేలా ఇందిరమ్మ కమిటీలు నియమించింది. లబ్ధిదారుల ఎంపికలో కమిటీలు కీలకంగా వ్యవహరించనున్నాయి.

బాధ్యతలు ఇవీ..
- ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంపై ప్రజలకు అవగాహన కల్పించాలి.
- ఇళ్ల నిర్మాణ పనులను పర్యవేక్షించడంతో పాటు లబ్ధిదారులకు సహాయంగా ఉండాలి. సోషల్ ఆడిట్‌లో తమ పాత్ర పోషించనున్నాయి.
- అర్హులను గుర్తించి ఎంపిక చేయాలి. ఏదైనా లోపాల వల్ల అనర్హులకు జాబితాలో చోటు లభిస్తే గుర్తించి తొలగించాలి.

కాంగ్రెస్ కేడర్‌లో అసంతృప్తి

ఇందిరమ్మ కమిటీల ఏర్పాటుపై కాంగ్రెస్ కార్యకర్తలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. పార్టీ కోసం కష్టపడిన వారికి కమిటీల్లో చోటు కల్పించలేదని ఎమ్మెల్యేల ఎదుట గోడు వెల్లబోసుకుంటున్నారు. మరోవైపు ఇందిరమ్మ కమిటీలను కాంగ్రెస్ కార్యకర్తలతో నింపారని ప్రతిపక్ష పార్టీలు ఆరోపిస్తున్నాయి. కమిటీల ద్వారా లబ్ధిదారుల ఎంపిక పారదర్శకంగా జరుగుతందన్న నమ్మకం లేదని, అన్ని పార్టీలకు అవకాశం కల్పించాలని డిమాండ్ చేస్తున్నాయి.

కమిటీ చైర్మన్లు, కన్వీనర్లుగా వీరే..

ఇందిరమ్మ కమిటీలో ఏడుగురు సభ్యులు ఉంటారు. గ్రామస్థాయిలో సర్పంచ్ చైర్మన్‌గా ఉంటారు. కానీ, సర్పంచ్‌లు లేకపోవడం వల్ల ప్రత్యేకాధికారి చైర్మన్‌గా, కార్యదర్శి కన్వీనర్‌గా ఉంటారు. వీరితో పాటు స్వయం సహాయక సంఘాల మహిళలు ఇద్దరు, అభివృద్ధిపై ఆసక్తి కలిగిన మరో ముగ్గురు స్థానికులు సభ్యులుగా ఉంటారు. మున్సిపాలిటీల్లో కౌన్సిలర్ చైర్మన్‌గా, స్వయం సహాయక సంఘాల మహిళలు ఇద్దరు, ముగ్గురు స్థానికులు ఉంటారు. కమిటీ సభ్యుల వివరాలతో కూడిన జాబితాను ఎంపీడీఓలు, మున్సిపల్ కమిషనర్లు కలెక్టర్‌కు అందజేశారు. ఈ జాబితా జిల్లా ఇంచార్జి మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు ఆమోదించాల్సి ఉంటుంది. అనంతరం కమిటీలను గెజిట్‌లో ప్రకటిస్తారు.

వైద్య విద్య.. నెరవేరే వేళ



మెడికల్ కళాశాల భవనం



మెడికల్ కళాశాల గేట్ వద్ద ఏర్పాటు చేసిన బోర్డు

నెలాఖరు నుంచి ఎంబీబీఎస్ తరగతులు
- ఇప్పటికే రెండు విడతల కౌన్సెలింగ్ పూర్తి
- 43 మంది విద్యార్థుల చేరిక
- ఈ వారంలో మూడో దశ కౌన్సెలింగ్
- ముస్తాబవుతున్న భవనం

భువనగిరి : వైద్య విద్య నెరవేరే కల ఆసన్నమవుతోంది. జిల్లాకు మంజూరైన యాదాద్రి మెడికల్ కళాశాలలో ఎంబీబీఎస్ తరగతులు ఈనెలాఖరు నుంచి ప్రారంభించేందుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. అందులో భాగంగా ఈ నెల మొదటివారంలో కాళోజీ నారాయణరావు విశ్వవిద్యాలయం నిర్వహించిన కౌన్సెలింగ్ ద్వారా 32 మంది విద్యార్థులు వెబ్ ఆప్షన్ ద్వారా ఎంపికయ్యారు. తాజాగా ముగిసిన రెండో విడత కౌన్సెలింగ్ ద్వారా మరో 11 మంది చేరారు. వీరంతా మెడికల్ కళాశాలలో జరుగుతున్న ధ్రువీకరణ పత్రాల పరిశీలనకు హాజరవుతున్నారు. త్వరలో నిర్వహించే చివరి విడుత కౌన్సిలింగ్‌తో పూర్తిస్థాయిలో సీట్లు భర్తీ అయ్యే అవకాశం ఉంది

50 సీట్లతో ప్రారంభం

మెడికల్ కళాశాల మొదటి సంవత్సరం 50 ఎంబీబీఎస్ సీట్లతో ప్రారంభం కానుంది. తరగతుల నిర్వహణకు భువనగిరి సమీపంలోని పాత కలెక్టరేట్ భవనం ముస్తాబవుతోంది. ముందుభాగంలో ఉన్న భవనంలో తరగతులు, ఇదే భవనం పైభాగంలో బాలుర హాస్టల్, వెనుక వైపు ఉన్న భవనంలో బాలికల హాస్టల్‌కు ఏర్పాట్లు జరుగుతున్నాయి. తరగతి గదులు, ప్రిన్సిపాల్, ప్రొఫెసర్ల కోసం ప్రత్యేకంగా గదులను సిద్ధం చేశారు.

బోధనాస్పత్రిగా జిల్లా కేంద్ర వైద్యశాల

పూర్తిస్థాయి మెడికల్ కళాశాల, ఆస్పత్రి నిర్మాణంకోసం యాదగిరిగుట్ట మండలం మల్లాపురంలో ప్రభుత్వం 20 ఎకరాల స్థలం కేటాయించింది. వైద్య కళాశాలకు అనుబంధంగా బోధనాస్పత్రిగా జిల్లా కేంద్ర వైద్యశాల అందుబాటులోకి రానుంది. ఆస్పత్రి సామర్థ్యాన్ని 220 పడకలకు పెంచేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఇందులో భాగంగా జిల్లా కేంద్ర ఆస్పత్రి భవనంపైన మరో అంతస్తు నిర్మిస్తున్నారు. మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్, ప్రొఫెసర్లు, ఇతర సిబ్బంది నియామకం పూర్తయ్యింది. బోధనాస్పత్రి అందుబాటులోకి వస్తే వైద్య సేవలు మరింత మెరుగుపడనున్నాయి. రోగులు అత్యవసర సేవలకోసం బీబీనగర్ ఎయిమ్స్, హైదరాబాదకు వెళ్లాల్సిన బాధలు తప్పనున్నాయి.

స్వచ్ఛమైన నీటిని సరఫరా చేయాలి



మాట్లాడుతున్న జెడ్పీ సీఈఓ శోభారాణి

బీబీనగర్ : ప్రజలకు స్వచ్ఛమైన నీటిని సరఫరా చేసే బాధ్యత వాటర్‌మెన్లదేనని జెడ్పీ సీఈఓ శోభారాణి, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ కృష్ణయ్య సూచించారు. గ్రామ పంచాయతీల్లోని వాటర్‌మెన్లకు బీబీనగర్ మండల పరిషత్ కార్యాలయంలో జరుగుతున్న శిక్షణ తరగతుల్లో గురువారం వారు పాల్గొని సూచనలు చేశారు. ట్యాంకులను తరచూ శుభ్రం చేస్తుండాలని, బ్లీచింగ్ కలిపి సరఫరా చేయాలని సూచించారు. పైపులైన్లు, గేట్‌వాల్వ్‌లకు లీకేజీలు ఏర్పడితే వెంటనే మరమ్మతులు చేయాలన్నారు.అలాగే నీటి నాణ్యత, ట్యాంకులను శుద్ధి చేసే విధానాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీనివాస్ రెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ ప్రశాంత్‌కుమార్, పద్మావతి, ఏఈ రవికిరణ్ పాల్గొన్నారు.

మెరుగైన వైద్యసేవలు అందించండి



పీహెచ్‌సీలో మందులను పరిశీలిస్తున్న కలెక్టర్

భూదాన్‌పోచంపల్లి : వైద్యాధికారులు, సిబ్బంది సమయపాలన పాటిస్తూ రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని కలెక్టర్ హనుమంతు కే.జెండగే సూచించారు. గురువారం భూదాన్‌పోచంపల్లి పీహెచ్‌సీని తనిఖీ చేశారు. రిజిస్టర్లు, మందుల స్టాక్ పరిశీలించారు. డెంగీ, చికున్‌గున్యా, మలేరియా వంటి విషజ్వరాల విషయంలో అప్రమత్తంగా ఉండాలని, రాపిడ్ కిట్లు అందుబాటులో ఉంచాలని సూచించారు.



వాల్మీకి చిత్రపటానికి కలెక్టర్ తదితరుల నివాళి

కలెక్టరేట్‌లో వాల్మీకి జయంతి

భువనగిరిటౌన్ : ఆదికవి మహర్షి వాల్మీకి జయంతి సందర్భంగా గురువారం కలెక్టరేట్‌లో వాల్మీకి చిత్రపటానికి కలెక్టర్ హనుమంతు కే.జెండగే, అదనపు కలెక్టర్లు బెన్‌షాలోమ్, గంగాధర్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌డీఓ నాగిరెడ్డి, కలెక్టరెట్ ఏఓ, వాల్మీకి బోయ కమ్యూనిటీ జిల్లా అధ్యక్షుడు రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

19న రామన్నపేట సబ్‌కోర్టు ప్రారంభం



ప్రారంభానికి సిద్ధంగా సబ్‌కోర్టు

రామన్నపేట : రామన్నపేటకు మంజూరైన సీనియర్ సివిల్ జడ్జి(సబ్‌కోర్టు) కోర్టును 19న ప్రారంభించనున్నారు. హైకోర్టు పోర్టుపోలియో జడ్జి జస్టిస్ జువ్వాది శ్రీదేవి, హైకోర్టు జడ్జి జస్టిస్ కూనూరు లక్ష్మణ్ ముఖ్య అతిథులుగా హాజరై నూతన కోర్టును ప్రారంభించనున్నారు. ఇప్పటికే రామన్నపేటలో ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టు, అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోర్టులు ఉన్నాయి. కొత్తగా ఏర్పాటు చేసే సబ్‌కోర్టు పరిధిలోకి రామన్నపేటటతో పాటు భూదాన్‌పోచంపల్లి, మోత్కూరు, వలిగొండ, అడ్డగూడూరు, చౌటుప్పల్, సంస్థాన్‌నారాయణపురం రెవెన్యూ మండలాలు వస్తాయి. పదేళ్లకుపైగా శిక్షపడే క్రిమినల్ కేసులు, విడాకుల కేసులు, రూ.50 లక్షల లోపు సివిల్ కేసులు సబ్‌కోర్టులో పరిష్కరించబడతాయి.

జీఓ 78 రద్దు చేయాలి




చౌటుప్పల్ కోర్టు ప్రాంగణంలో నిరసన వ్యక్తం చేస్తున్న న్యాయవాదులు

చౌటుప్పల్ : చౌటుప్పల్‌కు అన్యాయం చేసే జీఓ 78ను రద్దు చేయాలని కోరుతూ చౌటుప్పల్ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు గురువారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఊడుగు శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ.. పెద్ద ఎత్తున కేసులు ఉన్న చౌటుప్పల్ ప్రాంతాన్ని కాదని రామన్నపేటలో సబ్‌కోర్టు ఏర్పాటు చేయడం అనాలోచితమైన నిర్ణయమన్నారు. సబ్‌కోర్టు విషయంలో ఇప్పటికే తమ అభ్యంతరాలను తెలియజేసినా తిరిగి అదే నిర్ణయం తీసుకోవడం సరికాదన్నారు. చౌటుప్పల్ కోర్టు పరిధిని రామన్నపేట సబ్‌కోర్టులో కలుపుతూ విడుదల చేసిన జీఓను తక్షణమే ఉపసంహరించుకోవాలని కోరారు. కార్యక్రమంలో న్యాయవాదులు జిల్లా రమేష్, బాల్యం వెంకటాచలపతి, పిట్టల భిక్షమయ్య, రవీందర్, రాధాకృష్ణ, వెంకటయ్య, స్వాతి, పరమేష్, జంగయ్య, ఖయ్యూంపాష, రాఘవేంద్ర, సత్యనారాయణ, శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

అడ్డగోలు దోపిడీ!

తేమ, తాలు పేరుతో మద్దతు ధరలో కోత
- క్వింటాకు రూ.450 వరకు నష్టపోతున్న రైతులు
- అన్ని చోట్ల తెరుచుకోని కేంద్రాలు
- ప్రారంభించిన దగ్గర మొదలుకాని కొనుగోళ్లు



రామన్నపేట మండలం కక్కిరేణి కొనుగోలు కేంద్రంలో ధాన్యపు రాశులు



రామన్నపేటలో ప్రైవేట్ వ్యాపారికి ధాన్యం విక్రయిస్తున్న రైతు

రామన్నపేట, వలిగొండ : వానాకాలం ధాన్యం వెల్లువలా వస్తున్నా ఇంకా అన్నిచోట్ల కొనుగోలు కేంద్రాలు తెరుచుకోలేదు. ప్రారంభించిన చోట కొనుగోళ్లు మొదలుకాలేదు. ఇదే అదునుగా వ్యాపారులు, దళారులు రంగప్రవేశం చేసి తక్కువ ధరకు ధాన్యం కొనుగోలు చేస్తున్నారు. తేమ, తాలు పేరుతో మద్దతు ధరలో కోత విధిస్తూ అడ్డగోలుగా దోపిడీ చేస్తున్నారు. క్వింటాకు రూ.300 నుంచి రూ.450 వరకు నష్టపోతున్నామని, జాప్యం చేయకుండా కొనుగోళ్లు ప్రారంభించాలని రైతులు కోరుతున్నారు.

20 రోజులనుంచే వరి కోతలు

జిల్లాలో 2,81,885 ఎకరాల్లో రైతులు వరి సాగు చేశారు. 6,12,790 మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని వ్యవసాయ శాఖ అధికారులు అంచనా వేసి సివిల్ సప్లై శాఖకు నివేదిక అందజేశారు. అందుకు అనుగుణంగా ఐకేపీ, పీఏసీఎస్, మార్కెట్ కమిటీల ఆధ్వర్యంలో 323 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి, వాటి ద్వారా 4 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయాలని నిర్ణయించారు. కాగా జిల్లాలో 20 రోజుల నుంచే వరికోతలు మొదలయ్యాయి. కేంద్రాలకు వెల్లువలా ధాన్యం వస్తుంది. అయినా ఇప్పటి కేవలం 131 కొనుగోలు కేంద్రాలను మాత్రమే ప్రారంభించారు. అక్కడ కూడా కొనుగోళ్లు చేయడం లేదు.

రెండు రోజుల్లో ప్రారంభిస్తాం

తేమ ఎక్కువగా ఉండడంతో కొనుగోళ్లు ప్రారంభించలేదని, రెండు, మూడు రోజుల్లో చేపడుతామని జిల్లా పౌరసరఫరాలశాఖ అధికారి తెలిపారు.



ధాన్యంతో నిండిన వలిగొండ మార్కెట్

ప్రైవేట్‌కు తక్కువ ధరకు అమ్మిన



కక్కిరేణి శివారులో ఎకరం భూమిలో వరి సాగు చేశా. రెండు రోజుల క్రితం కొనుగోలు కేంద్రానికి ధాన్యం తరలించాను. అప్పటికే కేంద్రం నిండా ధాన్యపు రాశులు పేరుకుపోయాయి. నా వంతు వచ్చేసరికి నెలరోజులైనా పడుతుందని కేంద్రం సిబ్బంది చెప్పారు. అన్ని రోజులు వేచి ఉండలేక ప్రైవేట్ వ్యాపారికి విక్రయించాను. వ్యాపారి ధర తగ్గించి తీసుకున్నాడు.
–బుర్ర నగేష్, రైతు, కక్కిరేణి

వడ్లు తెచ్చి పది రోజులైంది



ధాన్యాన్ని కొనుగోలు కేంద్రానికి తరలించి పది రోజులు అవుతుంది. మబ్బులు పడుతుండడంతో ఆందోళనగా ఉంది. ఇల్లు వదిలి ధాన్యం వద్ద కాపలా కాస్తున్నాం. వెంటనే కొనుగోలు కేంద్రాలు ప్రారంభించి ధాన్యం కాంటా వేయాలి. అంతేకాకుండా ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరకు కొనుగోలు చేయాలి.
–జన్ని మహేష్, రైతు, మల్లేపల్లి

మబ్బులతో గుబులు

ఆకాశం మబ్బులు పట్టడం, రోజూ ఏదో ఒక చోట వర్షాలు కురుస్తుండడంతో అన్నదాత ఆందోళన చెందుతున్నాడు. కొందరు రైతులు ధాన్యాన్ని పొలం నుంచి నేరుగా మిల్లులకు తరలించి విక్రయిస్తున్నారు. రైతుల ఇబ్బందులను అదునుగా చేసుకుని కొన్ని గ్రామాల్లో వ్యాపారులు కల్లాల వద్దకు వచ్చి కొనుగోలు చేస్తున్నారు. దొడ్డు రకం వడ్లకు ప్రభుత్వ ప్రకటించిన మద్దతు ధర క్వింటాకు రూ.2,320 ఉండగా తేమ శాతం, తాలు ఎక్కువగా ఉందని రూ.1,900 నుంచి రూ.2,050కే కొనుగోలు చేస్తున్నారు. క్వింటాకు రెండు కిలోల చొప్పున తరుగు తీస్తున్నారని రైతులు వాపోతున్నారు. మొత్తంగా క్వింటా ఒక్కంటికి రూ.250నుంచి రూ.450 వరకు రైతులు నష్టపోతున్నారు. అంతటా కొనుగోలు కేంద్రాలు ప్రారంభించకపోవడం, తెరిచిన చోట కొనుగోళ్లు చేయకపోవడం వల్లే ఈ పరిస్థితి ఏర్పడిందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.

కొనుగోలు కేంద్రాల్లోనే మద్దతు ధర

- జిల్లా వ్యవసాయ అధికారి గోపాల్



ఇస్రాయిపల్లికుంటలో వరి పొలాన్ని పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయ అధికారి గోపాల్

బీబీనగర్ : ధాన్యానికి కొనుగోలు కేంద్రాల్లోనే మద్దతు ధర దక్కుతుందని, దళారులను ఆశ్రయించి మోసపోవద్దని జిల్లా వ్యవసాయ అధికారి(డీఏఓ) గోపాల్ రైతులకు సూచించారు. బీబీనగర్, ఇస్రాయిపల్లికుంట గ్రామంలో రైతులు సాగు చేసిన వరి చేలను సీబీఈ యాప్ ద్వారా పరిశీలించారు. ఐకేపీ, పీఏసీఎస్ కేంద్రాల్లో విక్రయించడం ద్వారా సరైన ధర లభిస్తుందన్నారు. అంతేకాకుండా ప్రభుత్వం సన్నరకం ధాన్యానికి క్వింటాకు రూ.500 బోనస్ చెల్లిస్తుందని, రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం బీబీనగర్‌లో ఎరువుల దుకాణాన్ని తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. ఆయన వెంట మండల వ్యవసాయ అధికారి పద్మ, ఏఈఓ ఉమామహేశ్వరి తదితరులు ఉన్నారు.

ఒంటిపై పెట్రోల్ పోసుకొని వ్యక్తి ఆత్మహత్య



దస్తగిరి (ఫైల్)

గరిడేపల్లి: ఒంటిపై పెట్రోల్ పోసుకొని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన గరిడేపల్లి మండలం గానుగబండ గ్రామంలో గురువారం తెల్లవారుజామున జరిగింది. మృతుడి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. గానుగబండ గ్రామానికి చెందిన షేక్ దస్తగిరి(48) ఇటీవల కొత్తగా ఇంటిని నిర్మించి అప్పులపాలయ్యాడు. అప్పులు తీర్చే మార్గం లేక గురువారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఒంటిపై పెట్రోల్ పోసుకొని నిప్పంటించుకున్నాడు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఈ ఘటనపై తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని గరిడేపల్లి ఎస్ఐ నరేష్ తెలిపారు.

టీడీఎస్ జేఏసీ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడిగా ఉపేందర్



నాగారం: తెలంగాణ దళిత సంఘాల (టీడీఎస్) జేఏసీ ఉమ్మడి నల్లగొండ జిల్లా అధ్యక్షుడిగా నాగారం మండల కేంద్రానికి చెందిన చిప్పలపల్లి ఉపేందర్ నియమితులయ్యారు. ఈ మేరకు సంఘం రాష్ట్ర చైర్మన్ ఈదుల పరశురాం చేతులమీదుగా గురువారం ఆయన నియామక పత్రం అందుకున్నారు. ఈ సందర్భంగా ఉపేందర్ మాట్లాడుతూ.. దళితుల సమస్యల పరిష్కారానికి కృషిచేస్తానని అన్నారు.

విత్తనోత్పత్తి క్షేత్రం ఏర్పాటుకు సన్నాహాలు

- డిండి మండలంలోని చెరుకుపల్లిలో ఏర్పాటు
- యాసంగి నుంచే విత్తనోత్పత్తి ప్రారంభం
- తొలుత వరి, వేరుశనగ విత్తనాల ఉత్పత్తి
- నేషనల్ సీడ్ కార్పొరేషన్‌తో వ్యవసాయశాఖ ఒప్పందం



చెరుకుపల్లిలో వ్యవసాయశాఖ భూములు పరిశీలిస్తున్న డీఏఓ శ్రవణ్‌కుమార్

నల్లగొండ అగ్రికల్చర్: జిల్లాలో విత్తనోత్పత్తి క్షేత్రాన్ని ప్రారంభించేందుకు వ్యవసాయశాఖ కసరత్తు ప్రారంభించింది. ప్రస్తుతం జిల్లాలో కేవీకే కంపాసాగర్ విత్తనోత్పత్తి క్షేత్రంలో ఫౌండేషన్ సీడ్‌ను మాత్రమే ఉత్పత్తి చేస్తున్నారు. దీనికి తోడు రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ నందిపాడు కూడా కొంత వరి విత్తనాలను ఉత్పత్తి చేసి రైతులకు సరఫరా చేస్తున్నప్పటికీ సరిపోని పరిస్థితి నెలకొంటుంది. జిల్లాలో వరిసాగు విస్తీర్ణం పెరగడంతో రైతులు నాణ్యమైన విత్తనాల కోసం ప్రైవేట్ సంస్థలను ఆశ్రయించాల్సి వస్తోంది. దీనిని దృష్టిలో ఉంచుకుని తక్కువ సమయంలో ఎక్కువ దిగుబడినిచ్చే విత్తనాలను విక్రయించాలని జిల్లా వ్యవసాయశాఖ నిర్ణయించింది. ఇందులో భాగంగా డిండి మండలం చెరుకుపల్లి గ్రామంలోని వ్యవసాయ శాఖకు చెందిన 200 ఎకరాల్లో విత్తనోత్పత్తిని తిరిగి పునరుద్ధరించనున్నారు. దానికి అవసరమైన సాగునీరు, బోరు బావులు కూడా సిద్ధం చేసుకున్నారు. ఇప్పటికే విత్తనోత్పత్తి క్షేత్రానికి సంబంధించిన భూములను జిల్లా వ్యవసాయశాఖ అధికారులు పరిశీలించి దానికి అవసరమైన అన్న వసతులు కల్పించే విదంగా అన్ని చర్యలను చేపట్టారు. ఈ క్షేత్రానికి పూర్తి స్థాయిలో ఏడీఏతో పాటు ఇద్దరు వ్యవసాయాధికారులను, ఇతర పరిపాలనా విభాగానికి చెందిన సిబ్బందిని కూడా నియమించారు.

నేషనల్ సీడ్ కార్పొరేషన్‌తో ఒప్పందం

ఈ యాసంగి సీజన్ నుంచి తొలుత వరి, వేరుశనగ విత్తనాలను ఉత్పత్తి చేయాలని నిర్ణయించింది. దీనికి అవసరమైన ఒప్పందాన్ని నేషనల్ సీడ్ కార్పొరేషన్‌తో వ్యవసాయశాఖ ఒప్పందం చేసుకుంది. డిండి విత్తనోత్పత్తి కేత్రంలో ఉత్పత్తి చేసిన వరి, వేరుశనగ విత్తనాలను నేషనల్ సీడ్ కార్పొరేషన్‌ను అందజేసి అక్కడి నుంచి నాణ్యమైన విత్తనాలను రైతులకు అందించే విదంగా వ్యవసాయశాఖ ఒప్పందం చేసుకుంది.

మహిళా హక్కుల సాధనకు పోరాటం చేస్తాం



మాట్లాడుతున్న మల్లు లక్ష్మి

నల్లగొండ టౌన్: మహిళా హక్కుల సాధనకు అలుపెరుగని పోరాటాలు నిర్వహిస్తామని ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి అన్నారు. గురువారం నల్లగొండలోని యూటీఎఫ్ భవన్‌లో నిర్వహించిన ఐద్వా మహాసభలో ఆమె జెండా ఆవిష్కరించి మాట్లాడారు. మనువాద ప్రభుత్వం వచ్చినప్పటికీ మహిళలపై అనేక దౌర్జన్యాలు జరుగుతున్నాయన్నారు. మహిళల రక్షణకు ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నిత్యావసరాల ధరలు అదుపు చేయడంలో ప్రభుత్వాలు ఘోరంగా విఫలమయ్యాయని ఆరోపించారు. ఉపాధి పనులు కల్పించడంలో ప్రమాణాలను పాటించడం లేదన్నారు. పేదలకు రేషన్ కార్డులు, పింఛన్లు అమలు చేయాలని, ప్రభుత్వ ఆస్పత్రులను బలోపేతం చేసి ప్రజలకు పూర్తి స్థాయిలో వైద్యం అందించాలన్నారు. ఈ నెల 21 నుంచి 29వ తేదీల్లో ఖమ్మంలో జరిగే ఐద్వా రాష్ట్ర మహాసభలకు జిల్లా నుంచి పెద్ద ఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు. అనంతరం చాకలి ఐలమ్మ, మల్లు స్వరాజ్యం చిత్రపటాలకు నివాళులర్పించారు. అదేవిధంగా ఐద్వా జిల్లా నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షురాలిగా పోలేబోయిన వరలక్ష్మి, ప్రధాన కార్యదర్శిగా పాలడుగు ప్రభావతి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కార్యవర్గ సభ్యులుగా జిట్ట సరోజ, కొండ అనురాధ, నాగమణి, తుమ్మల పద్మ, భూతంఅరుణ కుమారి, నిమ్మల పద్మ, కారంపుడి ధనలక్ష్మి, పాదూరి గోవర్ధన, మేకల వర్ష, లక్ష్మి, ఎం.డి. సుల్తానాతోపాటు 33 మంది కమిటీని ఎన్నుకున్నారు.

లతీఫ్ ఉల్లా షాఖాద్రి ఉర్సు ప్రారంభం

- గంధం ఊరేగింపును ప్రారంభించిన మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి
- గుట్టపైకి రూ.30 కోట్లతో ఘాట్ రోడ్డు పనులు చేపడతామని హామీ



గంధం తీసుకెళ్తున్న కలెక్టర్ నారాయణరెడ్డి, ఎస్పీ శరత్‌చంద్ర పవార్



గంధం తీసుకెళ్తున్న పోలీసులు



నృత్యం చేస్తున్న ముస్లింలు

రామగిరి(నల్లగొండ): నల్లగొండలోని లతీఫ్ ఉల్లాషాఖాద్రి ఉర్సు గురువారం ప్రారంభమైంది. పట్టణంలోని మదీనా మసీదు నుంచి గంధం ఊరేగింపును కలెక్టర్ నారాయణరెడ్డి, ఎస్పీ శరత్‌చంద్ర పవార్‌లతో కలిసి రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ప్రారంభించారు. అనంతరం కోమటిరెడ్డి మాట్లాడుతూ.. ఉర్సును విజయవంతం చేయాలని కోరారు. లతీఫ్ ఉల్లాషాఖాద్రి గుట్ట, బ్రహ్మం గారి గుట్టను దర్శించుకునేందుకు సుమారు రూ.30 కోట్లతో ఘాట్ రోడ్డు నిర్మాణ పనులు చేపడతామన్నారు. గతంలోనే తాను దర్గా అభివృద్ధి పనులు చేశానని, బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో దర్గా అభివృద్ధిని పట్టించుకోలేదన్నారు. వక్ఫ్ ఆస్తుల పరిరక్షణకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను కోరారు. కార్యక్రమంలో డీసీసీ ప్రెసిడెంట్ రాములునాయక్, ఆర్డీఓ శ్రీదేవి, మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు గుమ్మల మోహన్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ అహ్మద్ పాల్గొన్నారు.

క్రైస్తవుల అభివృద్ధికి సహకరిస్తా

క్రైస్తవుల అభివృద్ధికి సహకరిస్తానని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. నల్లగొండ పట్టణంలో గురువారం రెవరెండ్ బిషప్ కరణం థమస్ కుమార్ 35వ గురు పట్టాభిషేక వార్షికోత్సవానికి మంత్రి హాజరై ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు గుమ్మల మోహన్‌రెడ్డి, కౌన్సిలర్లు మాతంగి సత్యనారాయణ, బాబా, క్రైస్తవ నాయకులు పసల శౌరయ్య, కొంక సామ్సన్, రెవరెండ్ ఫాదర్‌లు అర్లారెడ్డి, తుమ్మ జోసెఫ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బొట్టుగూడ స్కూల్‌ను ఆదర్శంగా నిర్మిస్తాం



నల్లగొండ: బొట్టుగూడ ఉన్నత పాఠశాల నిర్మాణ పనులు పరిశీలిస్తున్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

నల్లగొండ: రాష్ట్రంలో ఎక్కడాలేని విధంగా బొట్టుగూడ ప్రభుత్వ ఉన్నత పాఠశాల నిర్మాణం చేపడతామని రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. గురువారం ఆయన నల్లగొండ పట్టణంలోని ప్రకాశం బజార్‌లో చేపట్టిన బొట్టుగూడ ప్రభుత్వ ఉన్నత పాఠశాల నిర్మాణ పనులను పరిశీలించి మాట్లాడారు. ప్రతీక్ ఫౌండేషన్ ద్వారా రూ.3కోట్లతో రాష్ట్రంలో ఏ ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాల లేని విధంగా బొట్టుగూడ ప్రభుత్వ ఉన్నత పాఠశాలను తీర్చిదిద్దనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా కాంట్రాక్టర్‌కు, పాఠశాల హెడ్మాస్టర్‌కు మంత్రి పలు సూచనలు చేశారు. 9, 10 తరగతులకు ప్రత్యేక డిజిటల్ తరగతులు, శిక్షణ కార్యక్రమాలు నిర్వహించేలా పాఠశాల నిర్మాణం చేపట్టాలన్నారు. పాఠశాలలోని అన్ని గదుల్లో ఏసీ, లిఫ్ట్ తదితర సౌకర్యాలు కల్పిస్తామని, పనుల్లో ఎలాంటి నాణ్యత లోపించకుండా నిర్మాణం చేపట్టాలని ఆదేశించారు. భవిష్యత్తులో అవసరమైతే మరో అంతస్తు నిర్మించేందుకు అవకాశం ఉండేలా భవన నిర్మాణం ఉండాలని అన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్ రెడ్డి , మాజీ జెడ్పీటీసీ లక్ష్మయ్య, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు గుమ్మల మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

కానిస్టేబుల్ సస్పెన్షన్, సీఐకి చార్జి మెమో

గుర్రంపోడు: మండలంలోని ముల్కలపల్లికి చెందిన జాల రజిత హత్య కేసుకు సంబంధించి గుర్రంపోడు పోలీస్ స్టేషన్ కానిస్టేబుల్ సత్యనారాయణను సస్పెండ్‌చేస్తూ గురువారం నల్లగొండ ఎస్పీ శరత్‌చంద్ర పవార్ ఆదేశాలు జారీ చేశారు. అంతేకాకుండా కొండమల్లేపల్లి సీఐ ధనుంజయకు ఎస్పీ నివేదిక ప్రకారం ఐజీపీ సత్యనారాయణ చార్జ్ మెమో జారీ చేశారు. హత్యను ఆత్మహత్యగా మార్చే ప్రయత్నం చేయడం, నిందితులను కేసు నుంచి తప్పించారని గుర్రంపోడు ఎస్ఐ వేమిరెడ్డి నారాయణరెడ్డిని ఈ నెల 14న సస్పెండ్ చేసిన విషయం తెలిసిందే. నిందితులతో కుమ్మక్కై, ఎఫ్ఐఆర్‌లో వారి పేర్లు పేర్కొనకుండా కానిస్టేబుల్ సత్యనారాయణ ద్వారా ఎస్ఐ రూ.లక్ష లంచం తీసుకున్నారని విచారణలో తేలింది.

ముగిసిన తహసీల్దార్, కంప్యూటర్ ఆపరేటర్ కస్టడీ

హుజూర్‌నగర్: ప్రభుత్వ భూములను అక్రమంగా బదిలీ చేసి రైతుబంధు నిధులు స్వాహా చేశారనే ఆరోపణలతో గతంలో హుజూర్‌నగర్ తహసీల్దార్‌గా పనిచేసిన జయశ్రీ, కంప్యూటర్ ఆపరేటర్ జగదీష్‌ల పోలీస్ కస్టడీ గురువారం ముగిసింది. మూడో రోజు హుజూర్‌నగర్ సీఐ చరమందరాజు దాదాపు ఐదు గంటల పాటు తహసీల్దార్, కంప్యూటర్ ఆపరేటర్‌ను విచారించారు. విలువైన ప్రభుత్వ, అసైన్డ్ భూములను ఎవరి ప్రోద్బలంతో ఇతరుల పేరుపై పట్టా చేశారని పోలీసులు వారిని ప్రశ్నించినట్లు సమాచారం. ఈ వ్యవహారంలో ఎవరైనా అధికారులు, ప్రజాప్రతినిధుల ప్రమేయం ఉందా అనే కోణంలో మంరిత సమాచారం రాబట్టినట్లు తెలిసింది. అంతేకాకుండా జర్నలిస్టుల ఇళ్ల పట్టాలకు సంబంధించిన వివరాలపై కూడా ఆరా తీసినట్లు తెలిసింది. తహసీల్దార్‌కు సంబంధించిన ఆస్తుల వివరాలను పరిశీలించినట్లు సమాచారం. మూడు రోజుల పోలీస్ కస్టడీ ముగియడంతో ఇద్దరినీ హుజూర్‌నగర్ కోర్టులో ప్రవేశపెట్టి జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించినట్లు సీఐ పేర్కొన్నారు.

రైలు కింద పడి యువకుడి ఆత్మహత్య

మిర్యాలగూడ అర్బన్: రైలు కింద పడి యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన మిర్యాలగూడ రైల్వే స్టేషన్ సమీపంలో గురువారం జరిగింది. రైల్వే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. త్రిపురారం మండలం అల్వాలపాడు గ్రామానికి చెందిన చిర్ర మల్లయ్య రెండో కుమారుడు చిర్ర శ్రవణ్‌కుమార్(18) హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ కళాశాలలో ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. దసరా పండుగకు ఇంటికి వచ్చిన అతడు గురువారం మిర్యాలగూడ రైల్వే స్టేషన్ సమీపంలో రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. రైలు పట్టాలపై మృతదేహాన్ని గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. విషయం తెలుసుకున్న రైల్వే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతుడి వద్ద దొరికిన ఆధారాల ప్రకారం కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. కుటుంబ సమస్యలు, ఆర్థిక ఇబ్బందులతోనే శ్రవణ్‌కుమార్ ఆత్మహత్యకు పాల్పడి ఉంటాడని రైల్వే పోలీసులు భావిస్తున్నారు. రైలు కింద పడటానికి ముందు పురుగుల మందు తాగినట్లు పోలీసులు గుర్తించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

హైదరాబాద్ ఎగ్జిబిషన్‌లో మర్రిచెట్టుతండా మహిళల స్టాల్



ఎగ్జిబిషన్‌లో మర్రిచెట్టుతండా మహిళలు ఏర్పాటు చేసిన స్టాల్

దేవరకొండ: హైదరాబాద్‌లోని అమీర్‌పేటలో గ్రామీణ్ సెలబ్రేటింగ్ డెవలప్‌మెంట్ కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్‌లో దేవరకొండ మండలం మర్రిచెట్టుతండాకు చెందిన మహిళలు స్టాల్‌ను ఏర్పాటు చేశారు. నాబార్డ్ సహకారంతో ఏర్పాటు చేసిన ఈ స్టాల్‌లో గిరిజన మహిళలు తయారుచేసిన హ్యాండీ క్రాఫ్ట్ వస్తువులను ప్రదర్శించినట్లు తండా మాజీ సర్పంచ్ నేనావత్ శ్రీనునాయక్ తెలిపారు. ఈ నెల 22 వరకు ఎగ్జిబిషన్‌లో ఈ స్టాల్ కొనసాగనున్నట్లు ఆయన పేర్కొన్నారు. స్టాల్ ఏర్పాటుకు సహకరించిన నాబార్డ్, ఏఆర్‌డీఎస్ ప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు.

నిందితుడిని శిక్షించాలంటూ ఆందోళన



శ్రీను ఇంట్లో కొండయ్య మృతదేహాన్ని ఉంచిన కుటుంబ సభ్యులు

వేములపల్లి (మాడ్గులపల్లి): మాడ్గులపల్లి మండలంలోని నారాయణపురం గ్రామానికి చెందిన కాకునూరి కొండయ్య(64) హత్య కారణమైన వారిని శిక్షించాలంటూ గురువారం మృతుడి కుటుంబ సభ్యులు, బంధువులు ఆందోళన చేపట్టారు. కొండయ్య బుధవారం ఇంట్లో ఇంటరిగా ఉన్న సమయంలో గుర్తుతెలియని వ్యక్తులు వచ్చి కత్తులతో దాడి చేసి తీవ్రంగా గాయపర్చారు. కుటుంబ సభ్యులు అతడిని నల్లగొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతిచెందాడు. కొండయ్యను గ్రామానికే చెందిన కాకునూరి శ్రీను హత్య చేయించాడని కొండయ్య కుటుంబ సభ్యులు ఆరోపించారు. ఈ మేరకు గురువారం శ్రీను ఇంట్లో కొండయ్య మృతదేహాన్ని సుమారు 3 గంటల పాటు ఉంచి ఆందోళన చేపట్టారు. విషయం తెలుసుకున్న సీఐ వీరబాబు, ఎస్ఐ కృష్ణయ్య గ్రామానికి చేరుకుని నిందితులను పట్టుకుని శిక్షిస్తామని హామీ ఇవ్వడంతో కొండయ్య కుటుంబ సభ్యులు, బంధువులు ఆందోళన విరమించి మృతదేహాన్ని తమ ఇంటికి తీసుకెళ్లారు. గ్రామంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

రేషన్ బియ్యం తరలిస్తున్న ముఠా అరెస్ట్

- రూ.18 లక్షల విలువైన బియ్యం, 2 లారీలు స్వాధీనం
- వివరాలు వెల్లడించిన నల్లగొండ ఎస్పీ శరత్‌చంద్ర పవార్



వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ శరత్‌చంద్ర పవార్

నల్లగొండ క్రైం: రేషన్ బియ్యాన్ని ఇతర రాష్ట్రాలకు తరలిస్తున్న ముఠాను వాడపల్లి పోలీసులు పట్టుకున్నారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలను నల్లగొండ ఎస్పీ శరత్‌చంద్ర పవార్ గురువారం తన కార్యాలయంలో మిర్యాలగూడ డీఎస్పీ రాజశేఖర్‌రాజుతో కలిసి విలేకరులకు వెల్లడించారు. ఎస్పీ తెలిపిన వివరాల ప్రకారం. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని బాపట్ల పట్టణానికి చెందిన శ్రీలక్ష్మీవెంకటేశ్వర అయ్యప్ప ట్రేడర్స్ యజమాని చీమకుర్తి సుధాకర్ రైతుల నుంచి వడ్లు కొనుగోలు చేయడంతో పాటు గుంటూరు, బాపట్ల, నరసరావుపేట ప్రాంతాల్లో రేషన్ బియ్యాన్ని తక్కువ ధరకు కొనుగోలు చేసి తన మిల్లులో వాటిని పాలిష్ చేసి సన్న బియ్యంగా మార్చి గుంటూరుకు చెందిన ఏజెంట్ అశోక్ ద్వారా నెలకు 10 నుంచి 12 లారీలను తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక, మహారాష్ట్ర, గుజరాత్, రాజస్థాన్ రాష్ట్రాలకు అక్రమ రవాణా చేస్తున్నాడు. కర్ణాటక రాష్ట్రం బసవకళ్యాణ్ జిల్లాకు చెందిన సయ్యద్ సలావుద్దీన్ లారీలో బియ్యం లోడ్ చేసి అశోక్, సుధాకర్ తెలంగాణ మీదుగా ముంబైకి రేషన్ బియ్యం తరలిస్తుండగా.. విశ్వసనీయ సమాచారం మేరకు రాష్ట్ర సరిహద్దు అయిన వాడపల్లి శివారులో పౌరసరఫరాల అధికారులతో కలిసి పోలీసులు లారీని పట్టుకున్నారు. అదేవిధంగా మరో లారీలో బాపట్ల నుంచి గుజరాత్‌కు తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని కూడా పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. లారీ డ్రైవర్ భీమయ్యను అదుపులోకి తీసుకున్నారు. రూ. 18లక్షల విలువైన 504 క్వింటాళ్ల రేషన్ బియ్యం, రెండు లారీలను సీజ్ చేసినట్లు ఎస్పీ తెలిపారు. చీమకుర్తి సుధాకర్, సయ్యద్ సలావుద్దీన్‌ను అరెస్ట్ చేశామని, అశోక్ పరారీలో ఉన్నట్లు పేర్కొన్నారు. ఈ కేసును ఛేదించిన మిర్యాలగూడ రూరల్ సీఐ వీరబాబు, వాడపల్లి ఎస్ఐ, డిప్యూటీ తహసీల్దార్ జావిద్‌ను ఎస్పీ అభినందించారు.

అనుమానాస్పద స్థితిలో బాలుడు మృతి

పెద్దఅడిశర్లపల్లి: అనుమానాస్పద స్థితిలో బాలుడు మృతిచెందిన ఘటన పెద్దఅడిశర్లపల్లి మండలంలోని మునావత్ తండాలో బుధవారం సాయంత్రం జరిగింది. గురువారం గుడిపల్లి ఎస్ఐ నర్సింహులు తెలిపిన వివరాల ప్రకారం.. మునావత్‌తండాకు చెందిన మునావత్ మోహన్ కుమారుడు దత్తు(12) హైదరాబాద్‌లో ఏడో తరగతి చదువుతున్నాడు. దసరా సెలవులకు ఇంటికి వచ్చాడు. సెలవులు ముగియడంతో బుధవారం దత్తు హైదరాబాద్‌కు బయలుదేరాల్సి ఉండగా.. తన తండ్రికి వ్యవసాయ పనులు ఉండటంతో ఆగిపోయారు. బుధవారం రాత్రి సాయంత్రం ఇంట్లో ఎవరూ లేని సమయంలో దత్తు కిటికీకి ఉరేసుకున్నాడు. అయితే బుధవారం ఉదయం వ్యవసాయబావి వద్ద దత్తు తాతతో తమ పాలివారైన మునావత్ బిల్లు ఘర్షణ పడ్డాడు. దీంతో తమకు మునావత్ బిల్లు కుటుంబ సభ్యులపై అనుమానం ఉందని దత్తు తండ్రి మోహన్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కొండమల్లేపల్లి సీఐ ధనుంజయ్య గౌడ్, ఎస్ఐ నర్సింహులుగౌడ్ ఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని దేవరకొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అనంతరం కుటుంబ సభ్యుల కోరిక మేరకు నల్లగొండ మెడికల్ కళాశాలకు పోస్టుమార్టంకు పంపారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ముదిమాణిక్యం కాలువలో వ్యక్తి మృతదేహం లభ్యం

త్రిపురారం: మండలంలోని నీలాయిగూడెం గ్రామ పంచాయతీ పరిధిలోని ఘంటారావు క్యాంపు వద్ద ముదిమాణిక్యం కాలువలో వ్యక్తి మృతదేహం లభ్యమైంది. గురువారం త్రిపురారం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఖమ్మం పట్టణంలోని సాయిగణేష్ నగర్‌కు చెందిన కన్నెకంటి గోపికిషోర్(57) మానసికస్థితి సరిగ్గా ఉండటం లేదు. కుటుంబ సభ్యులు అతడికి ఖమ్మంలోని ఓ ఆస్పత్రిలో వైద్యం చేయించారు. అయినా ఆరోగ్య పరిస్థితి కుదురుకోకపోవడంతో కొద్ది రోజులు బయట తిరుగుతూ ఇంటికి వచ్చేవాడు. ఈ నెల 12వ తేదీన ఇంటి నుంచి బయటకు వెళ్లిన గోపికిషోర్ తిరిగి రాలేదు. గురువారం ఉదయం 7గంటల సమయంలో త్రిపురారం మండలంలోని నీలాయిగూడెం గ్రామ పంచాయతీ పరిధిలోని ఘంటారావు క్యాంపు వద్ద ముదిమాణిక్యం కాలువలో స్థానికులు గుర్తుతెలియని మృతదేహాన్ని గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు అక్కడికి చేరుకుని మృతదేహం వద్ద దొరికిన ఆధారాల ప్రకారం మృతుడు గోపికిషోర్‌గా గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. కాలువ నుంచి మృతదేహాన్ని బయటకు తీసి పోస్టుమార్టం నిమిత్తం మిర్యాలగూడ ఏరియా ఆస్పత్రికి తరలించారు. మృతుడి కుమారుడు హరిదీప్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్‌కానిస్టేబుల్ శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు.

బాలిక ఆచూకీ లభ్యం

- ఇద్దరి రిమాండ్

భువనగిరి క్రైం: పట్టణంలోని కిరాణ దుకాణం నుంచి బాలికను తీసుకెళ్లిన వ్యక్తితో పాటు అతడికి సహకరించిన మరో వ్యక్తిని రిమాండ్‌కు తరలించినట్లు భువనగిరి పట్టణ సీఐ సురేష్‌కుమార్ తెలిపారు. గురువారం సీఐ తెలిపిన వివరాల ప్రకారం.. బిహార్ రాష్ట్రానికి చెందిన వలస కుటుంబం డాల్ఫిన్ హోటల్ సమీపంలో కిరాణం జనరల్ స్టోర్ నిర్వహిస్తూ జీవనం సాగిస్తున్నారు. వీరికి కుమార్తె ఈ నెల 10వ తేదీన కిరాణా దుకాణంలో కూర్చొని ఉండగా.. పక్కనే ఉన్న పంక్చర్ దుకాణంలో పనిచేస్తున్న ఖాజా ఖాన్ ఆమెను తీసుకుని పరారయ్యాడు. బాలిక కుటుంబ సభ్యులు ఈ నెల 14న పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దర్యాప్తు చేపట్టిన పోలీసులు ఖాజా ఖాన్ హైదరాబాద్‌లోని కాంచన్‌బాగ్‌లో తన సమీప బంధువైన బురాన్ పాషా ఇంట్లో ఉంటున్నట్లు తెలుసుకుని అదుపులోకి తీసుకున్నారు. ఖాజా ఖాన్, బురాన్ పాషాపై పోక్సో కేసు నమోదు చేసి రిమాండ్ చేసినట్లు సీఐ తెలిపారు. బాలికను సఖి కేంద్రానికి తరలించారు.

డీజే యజమానికి జరిమానా

గరిడేపల్లి మండలంలోని కీతవారిగూడెంలో ఇటీవల అనుమతులు లేకుండా డీజే నిర్వహించిన వ్యక్తిని పోలీసులు గురువారం తహసీల్దార్ ముందు హాజరుపర్చారు. తహసీల్దార్ కవిత డీజే యజమానికి రూ.30వేల జరిమానా విధించారు. నెల క్రితం తహసీల్దార్ దగ్గర రూ.లక్ష పూచికత్తుపై బైండోవర్ చేసిన తర్వాత కూడా డీజే నడపడంతో డీజేని సీజ్ చేసి తహసీల్దార్ ముందు ప్రవేశపెట్టారు. అనుమతులు లేకుండా డీజే నిర్వహిస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని ఎస్ఐ నరేష్ హెచ్చరించారు.

చికిత్స పొందుతూ విద్యార్థి మృతి



శ్రవణ్‌కుమార్ (ఫైల్)

భువనగిరి క్రైం: పురుగుల మందు తాగిన విద్యార్థి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ గురువారం మృతిచెందాడు. భువనగిరి మండలం గౌస్‌నగర్ గ్రామానికి చెందిన బూషబోయిన వెంకటేష్, అతడి కుమారుడు శ్రవణ్‌కుమార్(15) ఈ నెల 14న తమ వ్యవసాయ బావి వద్దకు వెళ్లి గేదెలకు పాలు పితుక్కొని వచ్చారు. తండ్రి వెంకటేష్ నేరుగా ఇంటికి వెళ్లిపోగా.. శ్రవణ్‌కుమార్ పాల సెంటర్‌కు వెళ్లి పాలు పోసి ఇంటికి వచ్చాడు. ఇంటికి వచ్చిన శ్రవణ్‌కుమార్ వ్యవసాయ భూమి వద్ద పురుగుల మందు తాగినట్లు తల్లదండ్రులకు తెలిపాడు. వెంటనే అతడిని భువనగిరి ఏరియా ఆస్పత్రికి తీసుకెళ్లారు. పరిస్థితి విషమించడంతో సికింద్రాబాద్‌లోని యశోదా ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ గురువారం మృతిచెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు భువనగిరి రూరల్ ఎస్ఐ సంతోష్ కుమార్ తెలిపారు. శ్రవణ్‌కుమార్ భువనగిరిలోని ప్రశాంతి స్కూల్‌లో 8వ తరగతి చదువుతున్నాడు.

యాదాద్రిలో శరత్ పౌర్ణమి వేడుకలు



శ్రీస్వామి అమ్మవార్ల సేవకు ముందు ప్రబంధ పారాయణం చేస్తున్న అర్చకులు



ఈఓ కు చెక్కు అందజేస్తున్న సుధీర్‌రెడ్డి

యాదగిరిగుట్ట: యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో గురువారం శరత్ పౌర్ణమిని పురస్కరించుకొని ఆచార్యులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీస్వామి అమ్మవార్లను విశేషంగా అలంకరించి ప్రత్యేక సేవను ఊరేగించారు. అనంతరం ఆలయ మండపంలో శ్రీస్వామి అమ్మవార్లను వేంచేపు చేయించి, వేద మంత్రాలతో పూజించి, ప్రబంధ పారాయణం చేశారు. విశేష ప్రసాదాన్ని ఆరగింపుగా చేసి పెట్టారు.

స్వర్ణ తాపడానికి రూ.10లక్షల విరాళం

యాదాద్రి లక్ష్మీనరసింహస్వామి ఆలయ విమాన గోపురానికి స్వర్ణ తాపడం కోసం హైదరాబాద్‌లోని సైదాబాద్‌కు చెందిన కంకర్ సుధీర్‌రెడ్డి రూ.10లక్షలు విరాళంగా అందజేశారు. గురువారం యాదాద్రీశుడిని దర్శించుకున్న ఆయన ఈఓ భాస్కర్‌రావును కలిసి రూ.10లక్షల చెక్కును అందజేశారు.

యాదాద్రిని అద్భుతంగా తీర్చిదిద్దారు

యాదాద్రి లక్ష్మీనరసింహస్వామి ఆలయాన్ని మాజీ సీఎం కేసీఆర్ అద్భుతంగా తీర్చిదిద్దారని సినీ నటుడు సుమన్ అన్నారు. యాదాద్రీశుడిని గురువారం ఆయన కుటుంబ సభ్యులతో కలిసి దర్శించుకున్నారు. గర్భాలయంలోని స్వయంభూ, ప్రతిష్ఠా అలంకార మూర్తులను దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించిన తర్వాత అర్చకులు ఆయనకు వేద ఆశీర్వచనం చేశారు.

స్వర్ణగిరిని దర్శించుకున్న సుమన్

భువనగిరి: పట్టణ శివారులోని స్వర్ణగిరి శ్రీవెంకటేశ్వరస్వామి ఆలయాన్ని కూడా సినీ నటుడు సుమన్ దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు ఆయన స్వాగతం పలికారు.

20 క్వింటాళ్ల రేషన్ బియ్యం స్వాధీనం

మునగాల: మండల పరిధిలోని బరాఖత్ గూడెం గ్రామ పంచాయతీలోని ఎస్సీ కాలనీకి చెందిన జిల్లేపల్లి శ్రీను ఇంట్లో అక్రమంగా నిల్వ ఉంచిన 20 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని గురువారం పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ప్రభుత్వ రేషన్ లబ్ధిదారులకు పంపిణీ చేసిన బియ్యాన్ని జిల్లేపల్లి శ్రీను తక్కువ ధరకు కొనుగోలు చేసి బయట మార్కెట్‌లో ఎక్కువ ధరకు అమ్ముతున్నట్లు విశ్వసనీయ సమాచారం అందడంతో అతడి ఇంటిపై దాడి చేసి ఇంట్లో నిల్వ ఉంచిన 20 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ బి. ప్రవీణ్‌కుమార్ తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.